



తీర్థాలలో శివయ్యకు అభిషేకం చేస్తున్న దృశ్యం



నీలాద్రిలో చెన్నరాయుడి సేవ



స్నానాల లక్ష్మీపురంలో భట్టి దంపతుల పూజలు



కూసుమంచి గణపేశ్వరాలయంలో

శంభో శివ శంభో

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా మహాశివరాత్రి వేడుకలు

- భక్తిపారవశ్యంతో మార్మోగిన శివ నామస్మరణ
- భక్తజనంతో పోటెత్తిన శైవక్షేత్రాలు
- కనులపండువగా శివపార్వతుల కల్యాణోత్సవాలు
- అభిషేకాలు, అర్చనలతో పరిమళించిన ఆధ్యాత్మిక సౌరభం
- పలు ఆలయాల్లో పూజలు జరిపిన డిప్యూటీ సీఎం భట్టి
- కూసుమంచి, తీర్థాల, నీలాద్రి, స్నానాల లక్ష్మీపురం ఆలయాలు కిటకిట

వివరాలు : 6లో



ఎన్నికల సామగ్రితో తరలివెళ్తున్న సిబ్బంది



ఖమ్మంలో పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ చేస్తున్న దృశ్యం

గుబులు రేపుతున్న గురువుల తీర్పు

నేడే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

- పోరు హోరాహోరీగా ఉంటుందని అంచనాలు
- ఉమ్మడి జిల్లాలో సర్వం సిద్ధం చేసిన అధికార యంత్రాంగం
- ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్
- మొత్తం 6,111 మంది ఓటర్లు.. 47 పోలింగ్ కేంద్రాలు...
- సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది
- ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్న ఇరు జిల్లాల కలెక్టర్లు
- అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు
- కీలకంగా మారనున్న రెండో, మూడో ప్రాధాన్యత ఓట్లు
- ఓట్ల కోసం రాత్రంతా హోరెత్తిన ప్రలోభాలు

ఖమ్మం కలెక్టరేట్/ఇల్లెందు/కొత్తగూడెం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. గురువారం ఉదయం 8గంటలకు పోలింగ్ ప్రారంభవుతుంది. ఇందుకోసం ఉమ్మడి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎన్నికల సిబ్బందికి బుధవారం బ్యాలెట్ బాక్సులు, పత్రాలు, ఇతర పోలింగ్ సామగ్రిని అందజేశారు. ఖమ్మం జిల్లాకు సంబంధించి ఖమ్మం కలెక్టరేట్‌లో, భద్రాద్రి జిల్లాకు సంబంధించి కొత్తగూడెంలోని శ్రీరామచంద్ర డిగ్రీ కళాశాలలో పోలింగ్ సామగ్రిని పంపిణీ చేశారు. మధ్యాహ్నం భోజనం తర్వాత సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే పోలింగ్ సాయంత్రం 4 గంటలకు ముగుస్తుంది.


ఖమ్మం జిల్లాలో 4,089 మంది ఓటర్లు ఉండగా.. 24 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2,022 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 1,068, మహిళా ఓటర్లు 954 మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 23 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో మొత్తం 19 మంది (మిగతా 6వ పేజీలో)

విధులు పకడ్బందీగా చేపట్టాలి: అదనపు కలెక్టర్
ఓట్ల కోసం అభ్యర్థుల నోట్ల ఎర 6

ప్రధాన పోటీ ఆరుగురి మధ్యే...



నర్సిరెడ్డి



సరోత్తంరెడ్డి



హర్షవర్ధన్‌రెడ్డి



రవీందర్



సుందర్‌రాజ్



శ్రీపాల్‌రెడ్డి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ తరఫున పింగిళి శ్రీపాల్‌రెడ్డి, యూటీఎఫ్ నుంచి అలుగుబెల్లి నర్సిరెడ్డి, తపస్ యూనియన్ నుంచి పులి సరోత్తం రెడ్డి బరిలో వున్నారు. ఇండిపెండెంట్ అభ్యర్థులుగా గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, ఎస్. సుందర్‌రాజు, అర్వ స్వాతి, పన్నాల గోపాలరెడ్డి, తలకొల పురుషోత్తం రెడ్డి, తాటికొండ వెంకటరాజయ్య, చాలిక చంద్రశేఖర్, కొలిపాక వెంకటస్వామి, లింగిడి వెంకటేశ్వర్లు, కంటె సాయన్న, యేలే చంద్రమోహన్, దామెర బాబురావు, బంక రాజు, జంగిలి కైలాసం, జె.శంకర్ పోటీలో ఉన్నారు.

కిష్టారం వాసులకు న్యాయం చేయండి...

కేంద్ర మంత్రికి బీజేపీ నేత సుధాకర్‌రెడ్డి వినతి



అమిత్‌షాకు వినతిపత్రం అందిస్తున్న పొంగులేటి సుధాకర్‌రెడ్డి

సత్తుపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలంలోని కిష్టారంలో ప్రజలకు ముప్పుగా మారిన సింగరేణి సైలోబంకర్ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర హోం శాఖమంత్రి అమిత్‌షాను బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన ఢిల్లీలో అమిత్‌షాకు వినతి పత్రం సమర్పించారు. 17 రోజులుగా గ్రామస్థులు చేపట్టిన రిలే దీక్షలు, అంబేద్కర్ నగర్, బీసీ కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సింగరేణి సైలోబంకర్ నుంచి వెలువడుతున్న కాలుష్యం స్థానికుల ఆరోగ్యంపై తీవ్రప్రభావం చూపుతోందని వివరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యలు, ప్రభావిత ప్రాంతాలలో సింగరేణి సంస్థ చేపట్టాల్సిన కార్యక్రమాలు, వైద్యశిబిరాలకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ ద్వారా సైలోబంకర్, సింగరేణి క్వార్టర్స్ నిర్మాణంపై విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. బాధిత కుటుంబాలకు పునరావాసం కల్పించడంపై ఆలోచన చేయాలని కోరారు.

ఎండుతున్న పంటలకు జీవం

నర్సింహులగూడెం ఎత్తిపోతల నుంచి నీటి విడుదల

కూసుమంచి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింహులగూడెం ఎత్తిపోతల నుంచి అధికారులు బుధవారం నీటిని విడుదల చేశారు. గతేడాది సెప్టెంబరు 1న వచ్చిన పాలేరు వరదల కారణంగా మోటార్లు నీటమునిగి మరమ్మతులకు గురయ్యాయి. దీంతో వేసవిలో సాగుచేసిన పంటలు ఎండిపోతుంటంతో రైతులు ఆందోళన చెందారు. ఈ క్రమంలో 'ఆంధ్రజ్యోతి' పత్రికలో కథనం ప్రచురితం కావడంతో పాటు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవ తీసుకొన్నారు. వెంటనే మరమ్మతులు చేయించాలని నీటిపారుదలశాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మరమ్మతులు పూర్తికావడంతో అధికారులు ఆయకట్టులోని చెరువులు నింపేందుకు ఇరిగేషన్ డీఈ రమేష్‌రెడ్డి స్విచ్చాన్ చేసి నీటిని విడుదల చేశారు. కాగా ఈ నీటితో సుమారు 300 ఎకరాలకు సాగునీరు అందనుంది. ముందుగా ఈ నీటితో చెరువులను నింపి ఆయకట్టుకు నీరందించనున్నారు.



నీటిని విడుదల చేస్తున్న డీఈ రమేష్‌రెడ్డి

బలంగా బహుజనవాదం : ఇంటలెక్చువల్ ఫోరమ్

పూల రవీందర్‌కు బహుజనుల మద్దతు అని విశ్వాసం



సూర్యాపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్

నల్లగొండ, ఫిబ్రవరి 26: ఉమ్మడి వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మునుపెన్నడూ లేని విధంగా బహుజనవాదం గెలుస్తుందని బహుజన మేధావులు విశ్వసిస్తున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల్లో గతానికి భిన్నంగా ప్రచారంలో ఈ వాదం పనిచేసిందని అభిప్రాయపడుతున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఆర్.కృష్ణయ్య, విశ్రాంత ఐఏఎస్ చిరంజీవులు తదితరులు ఈ ఎన్నికల్లో బీసీ, బహుజన వాదాన్ని బలంగా ప్రచారం చేయడంతో ఈ సానుకూలత వచ్చిందని భావిస్తున్నారు. బీసీ అభ్యర్థి పూల రవీందర్ గెలుపు ద్వారా రాష్ట్ర రాజకీయాలు మలుపు తిరుగుతాయని, ఇది బీసీ రాజ్యాధికార వాదానికి దోహదపడుతుందని చెబుతున్నారు. 35 పైగా ఉపాధ్యాయ, అధ్యాపక, ఆచార్య సంఘాల మద్దతుతో బహుజన అభ్యర్థిగా రంగంలో ఉన్న పూల రవీందర్ గెలుపునకు ఈ నినాదం దోహదపడుతుందని చెప్పారు.

విద్యారంగంలో రవీందర్ ప్రస్థానం

పూల రవీందర్ సాధారణ ఉపాధ్యాయుడిగా ప్రస్థానాన్ని ప్రారంభించి, పీఆర్టీయూ మండలాధ్యక్షుడిగా, ఉమ్మడి నల్లగొండ జిల్లా, రాష్ట్ర అధ్యక్షుడిగా, తెలంగాణ ఉద్యమంలో టీటీజేఏసీ చైర్మన్‌గా, ఆరేళ్లు ఎమ్మెల్సీగా పనిచేశారు. ఈ కాలంలో ఉపాధ్యాయుల పలు సమస్యల పరిష్కారానికి కృషి చేసిన విషయాన్ని బలంగా తీసుకెళ్లగలిగామని బీసీ నేతలు శీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో పీఆర్టీయూ సంఘంలోని వర్గ విభేదాలతో ఓటమిపాలైనా, గడిచిన ఆరేళ్లు రవీందర్ ఆ సంఘంలోనే ఉంటూ ఉపాధ్యాయులకు అండగా ఉంటూ వచ్చారన్నారు. 010 ద్వారా ఉపాధ్యాయులకు వేతనాలు, మహిళా ఉపాధ్యాయులను చైల్డ్ కేర్ సెలవులు, పండిట్, పీఈటీ అప్ గ్రేడేషన్, కేజీబీవీ ఉపాధ్యాయులకు 12 నెలల వేతనం, వివిధ పీఆర్సీ కాలాల్లో మెరుగైన ఫిట్‌మెంట్ సాధన, మోడల్ స్కూల్స్ ఆశ్రమ పాఠశాలల, గురుకులాల సిబ్బందికి ఉపయుక్తమైన ఎన్నో జీవోల వెనక రవీందర్ కృషి ఉందనేది ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఆయనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని(సీపీఎస్), యూనిఫైడ్ పెన్షన్ సిస్టమ్(యూపీఎస్)ను రద్దు చేస్తూ పాత పెన్షన్ విధానాన్ని(ఓపీఎస్) పునరుద్ధరించడానికి కృషి చేస్తారని, పీఆర్సీలో ఉద్యోగ ఉపాధ్యాయులకు 51 శాతం ఫిట్‌మెంట్‌తో నూతన పీఆర్సీ ఇప్పించడానికి కృషి చేస్తారన్నారు. మోడల్ స్కూల్, కేజీబీవీ, అర్బన్ రెసిడెన్షియల్స్ ఉపాధ్యాయుల పరిష్కారానికి కృషి చేస్తారని పేర్కొన్నారు. ప్రతీ పాఠశాలను సందర్శించి మొదటి ప్రాధాన్య ఓటు వేయాలని అభ్యర్థిస్తుంటే బహుజన బిడ్డగా పుట్టినందుకు, పోటీ చేస్తున్నందుకు తాను గర్వపడుతున్నానని పూల రవీందర్ పేర్కొంటున్నారు. గురువారం జరిగే ఎన్నికల్లో ఉపాధ్యాయులంతా తనను ఆదరిస్తారని ఆయన ఆశిస్తున్నారు.



శ్రీకాళహస్తిలో పూజలో పాల్గొన్న మంత్రి తుమ్మల

శ్రీకాళహస్తిలో మంత్రి తుమ్మల...

మహా శివరాత్రి సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఏపీలోని తిరుపతి జిల్లాలో గల శ్రీకాళహస్తి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి దర్శనం అనంతరం తీర్థప్రసాదాలు అందించారు. ఉమ్మడి రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని శ్రీకాళేశ్వరుడిని కోరుకున్నట్లు మంత్రి తెలిపారు. ఆయన వెంట తనయుడు యుగంధర్ వున్నారు.

-ఆంధ్రజ్యోతి, ఖమ్మం ఖానాపురం హవేలి

భలే భలే పుంగనూరు ఎద్దుల ప్రభ

ఆంధ్రా అమెరికా వెల్వడంలో ప్రదర్శించిన ఎర్రుపాలెం వాసి

ఎర్రుపాలెం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా అమెరికాగా పేరుగాంచిన వెల్వడంలో బుధవారం మహాశివరాత్రి వేళ పుంగనూరు ఎద్దులబండి ప్రభ సందడి చేసింది. ఎర్రుపాలెం మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన వేమిరెడ్డి వెంకటరెడ్డి (ఎన్ఆర్ఐ) ఈ ప్రభను తయారు చేయించారు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలంలో వెల్వడం గ్రామం ఉంది. ఇది ఖమ్మం జిల్లా సరిహద్దుల్లో ఉంటుంది. ప్రతీ ఏటా మహాశివరాత్రి సందర్భంగా అక్కడి బాలకోటేశ్వర స్వామి ఆలయం వద్ద జాతర ఘనంగా జరుగుతుంది. ఈ క్రమంలో ఎన్ఆర్ఐ వెంకటరెడ్డి జమలాపురంలోని మూల్పూరి డెయిరీ ఫామ్‌లో ఉన్న పుంగనూరు జాతి ఎద్దుల (2.5 అడుగుల ఎత్తు)తో ప్రభను ఆకర్షణీయంగా తయారుచేయించారు. అనంతరం ప్రభ బండిని వెల్వడం తరలించి అక్కడ ప్రదర్శించారు. పుంగనూరు ఎద్దులు తక్కువ ఎత్తుతో బలిష్టంగా ఉంటాయి. అవి బుడిబుడి అడుగులతో ప్రభను లాగుతున్న దృశ్యం అందరినీ ఆకట్టుకుంది. ప్రతి ఏడాది ఎద్దులబండితో ప్రభను ప్రదర్శిస్తున్నామని, ఈ సారి ప్రత్యేకంగా ఉండేందుకు పుంగనూరు ఎద్దులతో ప్రభను చేయించినట్టు వెంకటరెడ్డి తెలిపారు. కాగా, పుంగనూరు ఎద్దుల ప్రభ బండి వద్ద జనం ఫొటోలు, సెల్ఫీలు దిగేందుకు పోటీలు పడ్డారు.



పుంగనూరు ఎద్దులతో ప్రభ

మారుతున్న సర్కారీ స్కూళ్ల రూపురేఖలు

- విద్య, మౌలిక వసతులు, సదుపాయాల పెంపు
- బాల, బాలికలకు భద్రత, ఆత్మరక్షణ పద్ధతులపై శిక్షణ
- అవసరం మేరకు పీఎంశ్రీ నుంచి నేరుగా నిధులు
- జిల్లాలో తొలి విడతలో 20, మలి విడతలో నాలుగు పాఠశాలల ఎంపిక

భద్రాచలం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని పలు సర్కారీ స్కూళ్ల రూపురేఖలు మారుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రైమినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకంలో భాగంగా ప్రభుత్వ రంగ విద్యాసంస్థల బలోపేతానికి అవసరమైన నిధులను సమకూరుస్తోంది. ఇప్పటికే జిల్లాలోని 20 ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఊహించని మార్పులు చోటు చేసుకుంటుండటం విశేషం. విద్య, మౌలిక సదుపాయాలు, సౌకర్యాల మెరుగుతోపాటు మారుతున్న సాంకేతికతను ఆకలింపు చేసుకునేందుకు ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు వాటిపై శిక్షణ ఇచ్చే ప్రక్రియకు సైతం శ్రీకారం



నూతనంగా ఏర్పాటు చేస్తున్న సైన్స్ ల్యాబ్

చుడుతున్నారు. ఈ క్రమంలో పాఠశాలల్లో మ్యాథ్స్, సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే మెరుగైన ప్రభుత్వ విద్యాసంస్థల్లో బోధన తీరు, ల్యాబ్‌ల నిర్వహణ పరిశీలనకు సైతం విద్యార్థులను తీసుకెళ్లేందుకు వెసులుబాటు కల్పించారు. అన్నింటి కంటే ముఖ్యంగా బాలికలకు స్వయం రక్షణ, భద్రతకు ప్రాధాన్యమిస్తూ వారికి ఆత్మరక్షణకు సంబంధించిన అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు.

చోటుచేసుకుంటున్న మార్పులు

గతంలో పాఠశాలల్లో విద్యార్థులకు ఏదైనా ఆధునాతన పద్ధతుల్లో బోధించాలంటే ఎన్నో సమస్యలుండేవి. వాటిని అధిగమిస్తూ నేడు పీఎంశ్రీతో పాఠశాలల్లో రూపు రేఖలు మారుతున్నాయి. 2022-23లో పీఎంశ్రీ ప్రక్రియ ప్రారంభం కాగా.. తొలి విడతలో 20 పాఠశాలలను జిల్లాలో ఎంపిక చేశారు. మలి విడతలో మరో నాలుగు పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందులో భద్రాచలంలోని పీఎంశ్రీ ఎస్‌ఎన్‌ఎం జిల్లా పరిషత్ హైస్కూల్లో ఎన్నో మార్పులు ఇటీవల కాలంలో చోటు చేసుకుంటున్నాయి. తరగతి గదుల్లో లెడ్ లైట్లు ఏర్పాటుకు రూ.2వేలు కేటాయించారు. వర్మీ కంపోస్టుకు రూ.5వేలు, కిచెన్ గార్డెన్‌కు రూ.10వేలు, వేస్ట్ సెగ్రిగేషన్‌కు రూ.2 వేలు, స్వచ్ఛ పక్వాడాకు రూ.10 వేలు, ఎక్స్‌పర్ట్ అర్ట్స్‌కు రూ.5వేలు, క్షేత్రస్థాయిలో పర్యటనలకు రూ.1,76,500, బడిబాటకు రూ.1000, సివిల్ వర్క్‌లో భాగంగా సైన్స్‌ల్యాబ్ నిర్మాణానికి రూ.13 లక్షలు కేటాయించారు. బాలికల



పీఎంశ్రీ కింద ఎంపికైన నన్నపనేని జడ్పీ ఉన్నత పాఠశాల

ఆత్మరక్షణ కోసం కరాటే శిక్షణకు ఇన్‌స్ట్రక్టర్‌ను ఏర్పాటు చేయగా..ఆయనకు వేతనంగా రూ.30వేలు ఇచ్చారు. పాఠశాలల్లో విద్యా సంవత్సరం ముగింపు సమయంలో వార్షికోత్సవ నిర్వహణకు రూ.50 వేలు కేటాయించారు. ఇదిలా ఉండగా పాఠశాల భద్రత, రక్షణ చర్యల్లో భాగంగా సీసీ కెమెరా వ్యవస్థను సైతం పీఎంశ్రీ పాఠశాలల్లో ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం రూ.50వేలు కేటాయించారు.

అవసరం మేరకు పీఎంశ్రీ నుంచి నేరుగా నిధులు

నాగరాజశేఖర్, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి

ప్రభుత్వ పాఠశాలలను అన్ని అంశాల్లో పూర్తిస్థాయిలో పటిష్టం చేయడమే లక్ష్యంగా పీఎంశ్రీ నుంచి నిధుల కేటాయింపు జరుగుతోంది. సాధారణంగా పాఠశాలలకు వచ్చే గ్రాంట్ల కంటే పీఎంశ్రీ పథకం ఎంపికైన వాటికి అధిక నిధులు వస్తాయి. మౌలిక వసతులు, విద్యార్థుల్లో మౌలిక సామర్థ్యాల పెంపు, సాంకేతిక అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు నిధులు కేటాయింపు ఉంటుంది. 2026-27 విద్యా సంవత్సరం వరకు ఈ పథకం కింద నిధులు రానున్నాయి.



డబుల్స్ విభాగంలో పోటీ దృశ్యం

హోరాహోరీగా జాతీయ టెన్నిస్ పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్ ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో జరుగుతున్న ఆల్ ఇండియా ఓపెన్ టెన్నిస్ పోటీలు తుది దశకు చేరుకున్నాయి. పోటీల్లో భాగంగా బుధవారం క్వార్టర్ ఫైనల్స్ జరిగాయి. గత నాలుగు రోజులుగా జరుగుతున్న ఈ ప్రధాన పోటీల్లో టాప్ సీడెడ్ క్రీడాకారులను తక్కువ ర్యాంకింగ్ క్రీడాకారులు మట్టి కరిపిస్తుండటం విశేషం. బుధవారం జరిగిన సింగిల్స్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో నంబర్-1 ర్యాంకింగ్ క్రీడాకారుడు హర్యానాకు చెందిన ఉదిత్‌కంబోజ్‌ను మహారాష్ట్రకు చెందిన అధర్వ శర్మ ఓడించా డు. అంతేకాకుండా తెలంగాణకు చెందిన 4వ ర్యాంకింగ్ క్రీడాకారుడు తీర్థ శశాంక్‌మాచర్లను ఢిల్లీకి చెందిన రిక్కీ చౌదరి ఓడించాడు. పోటీల ను జిల్లా టెన్నిస్ అసోసియేషన్ బాధ్యులు మద్దినేని వెంకటరమణ, చల్లపల్లి శ్రీనివాస్, డాక్టర్ అనిల్, డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి సమీక్షిస్తున్నారు.

సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్స్‌లో విజేతలు ....

అధర్వశర్మ (మహారాష్ట్ర) 7-6, 1-6, 6-3 స్కోరు తేడాతో ఉదిత్‌కంబోజ్ (హర్యానా)పై విజయం సాధించాడు. రిక్కీ చౌదరి(ఢిల్లీ) 4-0 స్కోరు తేడాతో తీర్థ శశాంక్ మాచర్ల (తెలంగాణ)పై, సందేశ్ డి కురాలే(మహారాష్ట్ర) 6-1, 6-1 తేడాతో జతిన్‌నైన్(హర్యానా)పై, ఓగేస్ తేజో జయప్రకాశ్(తమిళనాడు) 6-0, 6-1 తేడాతో వంశ్‌బిష్ట్ (ఢిల్లీ)పై విజయం సాధించారు.

డబుల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో విజేతలు...

ఓగేస్ తేజో జయప్రకాశ్ (తమిళనాడు) ఉదిత్ కంబోజ్ (హర్యానా)ల జోడీ 6-4, 7-5 స్కోరు తేడాతో దీపక్ (కర్ణాటక) రక్షక్‌తరుణ్ (తమిళనాడు)ల జోడీపై విజయం సాధించగా వంశ్‌బిష్ట్ (ఢిల్లీ) దేబాసిస్‌సాహు (ఒడిస్సా)ల జోడీ 7-5, 6-7, 10-3 స్కోరు తేడాతో రిక్కీచౌదరి (ఢిల్లీ) జతిన్‌నైన్ (హర్యానా)ల జోడీపై, ఆదిత్యవర్ధన్, నైషిక్‌రెడ్డి (తెలంగాణ) జోడీ 6-3, 4-6(10-6) స్కోరు తేడాతో సార్థక్ గులాటి (పంజాబ్) సందేశ్‌డి కకురాలే (మహారాష్ట్ర) జోడీ పై, తీర్థ శశాంక్ మాచర్ల (తెలంగాణ) అధర్వశర్మ (మహారాష్ట్ర) జోడీ 6-0, 6-1 స్కోరు తేడాతో యశ్వంత్ గుండ్లపల్లి (ఆంధ్రప్రదేశ్) దేవహర్షిత్ నీలం (తెలంగాణ) జోడీపై విజయం సాధించారు.

న్యూరాలజీ సీటు సాధించిన డాక్టర్ మయూర్



ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో (ఐఎన్ఐసీఈటీ ఎస్ఎస్) 2025 విద్యా సంవత్సరానికిగాను ఇటీవల జరిగిన సూపర్ స్పెషాలిటీ వైద్య ప్రవేశ పరీక్షలో ఖమ్మానికి చెందిన వైద్యుడు డాక్టర్ మయూర్ ప్రతిభ కనబరిచాడు. దేశవ్యాప్తంగా పోటీ ఉన్న ఈ విభాగంలో ఓపెన్ కేటగిరీలో సీటు సాధించడం విశేషం. కేరళలోని తిరువనంతపురం ప్రతిష్టాత్మకమైన వైద్య విద్యాసంస్థ అయిన శ్రీచిత్ర తిరుణాల్ ఇనిస్టిట్యూట్‌లో (ఎస్సీటీఐఎంఎస్)లో సూపర్ స్పెషాలిటీ కోర్సులో డీఎం న్యూరాలజీ విభాగంలో సీటు సాధించాడు. డాక్టర్ మయూర్ తండ్రి డాక్టర్ హనుమాన్ సింగ్ ఖమ్మం బోధనాసుపత్రిలో ఆర్థోపెడిక్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

శ్రీరామనవమి పుష్పాలంకరణకు రూ.12 లక్షల విరాళం

భద్రాచలం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి వారికి ఏప్రిల్ ఆరున జరిగే శ్రీరామనవమి సమయంలో పుష్పాలంకరణకు ఉపయోగించేందుకు రూ.12లక్షలను నెల్లూరుకు చెందిన భక్తులు విరాళంగా అందజేశారు. నెల్లూరులో మంగళవారం శ్రీరామరథంలో స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరుకు చెందిన ఓ.సంతోష్- సాహిత్య దంపతులు విరాళాన్ని అందజేశారు. ఇదిలా ఉండగా బుధవారం భద్రాచలంలోని రామాలయంలో దేవస్థానం నిత్యాన్నదాన పథకం కోసం రూ.లక్ష విరాళాన్ని పట్టణంలోని తాతగుడి సెంటర్‌కు చెందిన ఎం.సుశీల అందజేశారు.

గుబులు రేపుతున్న గురువుల తీర్పు

(5వ పేజీ తరువాయి)

అభ్యర్థులు పోటీలో ఉన్నారు. పోలింగ్ పూర్తయిన తర్వాత సీల్ చేసిన బ్యాలెట్ బాక్సులను ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో నల్లగొండలోని రిసెప్షన్ సెంటర్‌కు తరలిస్తారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 163 సెక్షన్ విధించారు.

ఓట్ల కోసం వేట..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం కోసం అభ్యర్థులు ఆఖరి నిమిషం వరకు తమ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఈ ఎన్నికల్లో గెలుపు ఓటములను ప్రభావితం చేస్తాయని భావిస్తున్న రెండో, మూడో ప్రాధాన్యత ఓట్ల కోసం అభ్యర్థులు తీవ్రస్థాయిలో యత్నిస్తున్నారు. ఉపాధ్యాయ సంఘాలకు కమిట్‌మెంట్ లేని టీచర్ల ఓట్లకోసం డబ్బు, మద్యం, విందులు ఏర్పాటు చేస్తున్నారు. బరిలో నిలిచిన ప్రధాన అభ్యర్థుల మద్దతుదారులు కులాల పేరిట కార్యకలాపాలు సాగిస్తున్న సంఘాల నాయకులను రంగంలోకి దించారు. ప్రధాన పోటీలో ఉన్న ముగ్గురు అభ్యర్థుల తరుపున ఓటుకు రూ.వెయ్యి నుంచి రూ.రెండు వేల వరకు పంపిణీ చేస్తున్నట్లు తెలిసింది. ప్రైవేట్ విద్యాసంస్థల్లో టీచర్ల ఓట్లను సంబంధిత మేనేజ్మెంట్‌లతో ఒప్పందాలు కుదుర్చుకుంటూ ఓట్లు రాబట్టుకునే యత్నాలు చేస్తున్నారు.

రెండో, మూడో ప్రాధాన్యతా ఓట్లే కీలకం..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రధానంగా ఐదుగురు అభ్యర్థుల నడుమ తీవ్ర పోటీ నెలకొనడంతో రెండో, మూడో ప్రాధాన్యత ఓట్లు కీలకంగా మారినట్లు పరిశీలకులు భావిస్తున్నారు. హోరాహోరీగా మారిన ఈ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓట్లతో గెలుపు సాధ్యమయ్యే పరిస్థితులు కనిపించకపోవడంతో అభ్యర్థులు రెండు, మూడో ప్రాధాన్యత ఓట్ల వేట సాగిస్తున్నారు. వివిధ సంఘాల్లో క్రియాశీలకంగా ఉన్న నాయకులు పోటీలో ఉన్న అభ్యర్థుల మద్దతుదారులతో రెండు, మూడు ప్రాధాన్యతా ఓట్ల కోసం ఒప్పందాలు చేసుకుంటున్నారు.

గత ఎన్నికల్లో ఉత్కంఠ

2019 ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజేతను నాలుగో రౌండ్ ప్రాధాన్యత ఓట్లే తేల్చాయి. ఆ ఎన్నికల్లో 18,027ఓట్లు పోల్ కాగా, విజేతగా నిలవాలంటే 9,014 కోటా ఓట్లు సాధించాల్సి ఉంది. అయితే యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి 2019లో విజేతగా నిలిచినా.. ఆయనకు తొలి ప్రాధాన్యత ఓట్లు 8,976మాత్రమే లభించాయి. దాంతో ఎలిమినేషన్ పద్ధతిలో రెండు, మూడు, నాలుగు రౌండ్ల లెక్కింపు (ఎలిమినేషన్)తోనే అలుగుబెల్లి నర్సిరెడ్డి విజయానికి అవసరమైన 9,021 కోటా ఓట్లు లభించాయి. తాజాగా జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో సైతం పలు రాజకీయ, కుల సమీకరణాలు, మద్దతు సంఘాల పరిణామాలతో తీవ్ర పోటీ నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో తొలి ప్రాధాన్యత ఓట్లతో రెండు, మూడో ప్రాధాన్యతా ఓట్లపై దృష్టి సారించారు. ప్రధాన పోటీదారులు, వారి మద్దతుదారులు బుధవారం నామమాత్రంగా పోటీలో ఉన్న అభ్యర్థులతో మంతనాలు సాగించారు. ఈ క్రమంలో రెండో ప్రాధాన్యతా ఓట్ల కోసం డబ్బు లావాదేవీలు కూడా జరిగినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో పోలింగ్ సరళిపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

ఓటు తప్పక వేయండి...

భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎన్నికల పోలింగ్‌లో గురువారం అర్హత కలిగిన ప్రతి ఉపాధ్యాయుడు తన ఓటు హక్కును వినియోగించుకోవాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. బుధవారం కొత్తగూడెం శ్రీరామచంద్ర డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటు హక్కు కలిగిన ఉపాధ్యాయులందరూ ప్రశాంతమైన వాతావరణంలో తమ ఓటు హక్కు వినియోగించునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. జిల్లాలో ఏడు రూట్లు ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి రూటుకి ఒక సెక్టార్ అధికారి, ఒక రూట్ ఆఫీసర్‌ను నియమించామని తెలిపారు. పీవోలు, ఏపీవోలకు పోలింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు.

పోలింగ్ విధులు పకడ్బందీగా చేపట్టాలి

అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ విధులను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని జిల్లా రెవెన్యూ అధికారి ఏ.పద్మశ్రీతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ, ఎన్నికల నియమ, నిబంధనలను తు.చ. తప్పకుండా పాటిస్తూ పోలింగ్ విధులను కట్టుదిట్టంగా నిర్వహించాలని అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కోసం ఖమ్మం జిల్లాలో 24పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశామని, మొత్తం 4089మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు 9 సెక్టార్ అధికారులు, 28 ప్రిసైడింగ్ అధికారులు, 27 అసిస్టెంట్ ప్రొసీడింగ్ అధికారులు, 58 ఇతర పోలింగ్ సిబ్బంది, 28 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు, 8 రూట్లలో పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది, సామగ్రిని తరలిస్తున్నామని, వీటి కోసం 8 ఆర్టీసీ బస్సులను సన్నద్ధం చేశామన్నారు. ఎండలను దృష్టిలో ఉంచుకొని ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు అవసరమైన చల్లని నీరు, క్యూలైన్ల వద్ద టెంట్, ఇతర సౌకర్యాలు కల్పించామని, జిల్లాలోని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రత ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో ఎన్.అరుణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు స్వామి, కలెక్టరేట్ ఎన్నికల డీటీ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల కోసం నోట్ల ఎర

ఖమ్మం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో డబ్బు ప్రభావం ఈసారి స్పష్టంగా కనిపించింది. ఓట్ల కోసం నోట్ల పంపిణీ బుధవారం రాత్రి గప్‌చుప్‌గా సాగింది. ప్రత్యర్థి సంఘాల ఓట్లపై గురి పెట్టి నోట్ల పంపిణీ చేశారు. క్రాస్ ఓటింగ్ చేయాలని, లేదా రెండో ప్రాధాన్యత ఓటైనా వేయాలంటూ బహుముఖ వ్యూహంతో చివరి ప్రయత్నంగా అభ్యర్థులు ఓట్ల కోసం గాలం వేశారు. జిల్లా కేంద్రాలైన ఖమ్మం, కొత్తగుడెం తోపాటు మునిసిపల్ పట్టణాలైన మధిర, సత్తుపల్లి , వైర, ఇల్లెందు పాల్వంచ, పట్టణాల్లో కూడ ఓట్ల కోసం డబ్బు పంపిణీ జోరుగా సాగింది. బరిలో ఉన్న ప్రధాన ఉపాధ్యాయ సంఘాల అభ్యర్థి రూ. 2 వేలు నుంచి 2500వరకు పంపిణీ చేయగా, రాజకీయ పార్టీల మద్దతుతో ఉన్న అభ్యర్థులు కూడ రూ. 2 వేల నుంచి 3 వేల వరకు డబ్బు పంపిణీ చేశారు. ఉపాధ్యాయ సంఘాలు రాజకీయ పార్టీలు, సామాజిక సంఘాలు మద్దతులో బరిలో ఉన్న ప్రధాన అభ్యర్థులు డబ్బు పంపిణిలో కూడ పోటాపోటీగా సాగించారు. మొదటి ప్రాధాన్యత, లేదా రెండు, మూడో ప్రాధాన్యతైనా ఇవ్వండి అంటూ ఒప్పందాలు చేసుకున్నారు.

ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

శివరాత్రి వేళ డిప్యూటీ సీఎం భట్టి పూజలు

మిత్రులతో కలిసి జాతర సందర్శన

వైరా, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని, ప్రపంచంలోని తెలుగు వారంతా క్షేమంగా ఉండాలని శివపార్వతులను వేడుకున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. బుధవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఖమ్మం జిల్లా వైరా మండలంలోని తన స్వగ్రామం స్నానాల లక్ష్మీపురంలో శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో సతీమణి నందినితో కలిసి పూజలు చేశారు. ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ, ఆయన తండ్రి రాజీవ్‌గాంధీ కుటుంబం పేరిట పూజలు నిర్వహించారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి శివపార్వతుల ఆశీస్సులు ఉండాలని వేడుకున్నారు. పూజ అనంతరం జాతరలో ఏర్పాటుచేసిన దుకాణాల్లో తమ గ్రామానికి చెందిన చిన్ననాటి



మిఠాయిని పంచుతున్న భట్టి

మిత్రులతో కలిసి కలియతిరిగారు. మిఠాయిలు కొనుగోలు చేసి మిత్రులకు పంచుతూ ఆనందంగా గడిపారు. స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, లలిత దంపతులు కూడా ఆలయంలో పూజలు చేశారు.

ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు రాయల నాగేశ్వరరావు, మువ్వా విజయ్‌బాబు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌ఛైర్మన్ బొర్రా రాజశేఖర్, కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న తమ్మినేని వీరభద్రం

పేదల పక్షపాతి కాసాని ఐలయ్య

ఖమ్మంఖానాపురంహవేలి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి):ప్రాణం పోయేంత వరకు ప్రజల కోసమే పోరాడిన కాసాని ఐలయ్య పేదల పక్షపాతి అని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం అన్నారు. బుధవారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్యభవన్‌లో ఇటీవల మృతి చెందిన కాసాని ఐలయ్య సంస్మరణ సభ జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన తమ్మినేని మాట్లాడుతూ రైతు కూలీల, కార్మికుల, వృత్తిదారుల సమస్యలపై నిరంతరం ఉద్యమాలకు ఐలయ్య నాయకత్వం వహించేవాడన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావులు మాట్లాడుతూ ఐలయ్య జీవితం కమ్యూనిస్టులకు ఆదర్శమన్నారు. యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన సభలో ముందుగా ఐలయ్య చిత్రపటానికి తమ్మినేని పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

బాల కార్మికుల.. బతుకు పోరాటం



ఉండీలలు తయారు చేస్తున్న బాలుడు

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): బతుకు పోరాటంలో మేము సైతం అంటున్నారు ఈ బాల కార్మికులు. ఎర్రటి ఎండను సైతం లెక్క చేయకుండా తల్లి దండ్రులు చేసే పనికి వారు కూడా సహాయ సహకారం అందిస్తూ.. బతుకుపోరాటం చేస్తున్నారు ఈ బాలకార్మికులు. ఖమ్మం రూరల్ మండలం, తీర్థాల సంఘమేశ్వరస్వామి జాతరకు భక్తులు పెద్దఎత్తున వచ్చి స్వామివారిని దర్శించుకుని వెళ్లిపోయేవారే ఎక్కువగా ఉంటారు. కాని జాతర కేవలం స్వామిని దర్శించుకోవడం కోసమే కాదు పొట్టుకూటికోసం వివిధ వృత్తుల వారికి కూడా పొట్టనింపుతుంది. జాతరలో కొందరు బాలకార్మికులు ఎర్రటి ఎండను లెక్క చేయకుండా వారి పనులలో నిమగ్నమయ్యారు. ఓ బాలుడు ఎర్రటి ఎండలో గాంధీ వేషంలో, మరో బాలుడు ఉండీలలు తయారు చేస్తు, మరోబాలుడు బొమ్మలు, వస్తువులు అమ్ముకుంటూ బతుకుపోరాటం చేస్తున్నారు.



బొమ్మలు అమ్ముతున్న బాలుడు

శంభో శివ శంభో..

ఖమ్మం ఖానాపురం హవేలి/కొత్తగూడెం సాంస్కృతికం/భద్రాచలం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఓంకార నాదం ప్రతిధ్వనించింది.. హర హర మహాదేవ అంటూ శైవక్షేత్రాలన్నీ ఉప్పొంగాయి.. శివ శివ శంకర.. భక్త వశంకర.. అంటూ పరమశివుడిని భక్తులు మనసారా కొలిచారు.. మహాశివరాత్రి వేడుకలు ఉమ్మడి జిల్లాలో బుధవారం ఘనంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే శివాలయాల్లో పూజలు, అభిషేకాల సందడి మొదలైంది.. పోటెత్తిన భక్తజనంతో ఆలయాలు కిటకిటలాడాయి. రాత్రి పార్వతీ పరమేశ్వర్ల కల్యాణం కనులపండువ చేసింది. భక్తులకు ఇబ్బందులు తలత్తకుండా దేవాదాయ, పోలీసుల అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు.

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నందిని దంపతులు మధిర శివాలయం, స్నానాల లక్ష్మీపురం, ముదిగొండ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాహుల్‌గాంధీ, రాజీవ్ గాంధీ, కుటుంబ సభ్యుల పేరిట పూజలు నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, విజయలక్ష్మి దంపతులు తీర్థాల సంగమేశ్వరస్వామి ఆలయం, కూసుమంచి గణపేశ్వర స్వామి ఆలయం, నగరంలోని గుంటుమల్లేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురాంరెడ్డి... వైరా స్నానాల లక్ష్మీపురం, గుంటుమల్లేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కూసుమంచి శివాలయంలో మాజీ ఎంఎల్‌ఏ కందాళ ఉపేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్తుపల్లిలో ఎంఎల్‌ఏ మట్టా రాగమయి, మాజీ ఎంఎల్‌ఏ సండ్ర వెంకట వీరయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైరాలోని పల్లిపాడు శివాలయంలో ఎంఎల్‌ఏ రాందాస్‌నాయక్ మాలోత్, బీజేపి రాష్ట్ర నాయకుడు తాండ్ర వినోదరావు పూజలు నిర్వహించారు.

మహాశివరాత్రి సందర్భంగా ఆయా శివాలయాల్లో ఈవోలు, భక్త బృందాలు విస్తృత ఏర్పాట్లు చేశారు. చలువ పందిళ్ళు, క్యూలైన్లు, స్నాన ఘట్టాలు, మంచినీరు, తదితర ఏర్పాట్లను చేశారు. తీర్థాల సంగమేశ్వరస్వామి, కూసుమంచి గణపేశ్వర స్వామి, స్నానాల లక్ష్మీపురం చంద్రశేఖరస్వామి, మధిర మృత్యుంజయ స్వామి, రామలింగేశ్వరస్వామి ఆలయాలతో పాటు, సత్తుపల్లి నీలాద్రి శివాలయం, ఖమ్మం బ్రాహ్మణబజార్ శివాలయం, గుంటుమల్లేశ్వర స్వామి ఆలయం, కైకొండాయిగుడెం కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం, ఇండస్ట్రీయల్ ఏరియాలోని విశాలక్షి సమేత కాశీవిశ్వేశ్వర స్వామి తదితర ఆలయాలకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామి దర్శనం చేసుకున్నారు.

పండుగ సందర్భంగా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నీలాద్రి, కూసుమంచి ఆలయాల్లో అన్నదానం, మిగిలిన ఆలయాల్లో ప్రసాద వితరణ చేశారు. రాత్రి పలు ఆలయాల్లో శివ పార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు జాగారాలతో వేడుకల్లో పాల్గొన్నారు. ఆలయాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు, వైద్యసేవలు అందుబాటులో ఉంచారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఎం.వీరస్వామి ఏర్పాట్లను పరిశీలించారు.

భద్రాద్రి జిల్లా పినపాక మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రాలను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దర్శించుకున్నారు. స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గొట్టెళ్ల గ్రామం వద్ద ఉన్న శివాలయాన్ని దర్శించుకున్నారు. అలాగే జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలోని గణేష్‌టెంపుల్, ప్రగతినగర్ ఉమామహేశ్వరాలయం, పాండురంగా భజనమందిర్, బూడిదగడ్డ, మెయిన్ హాస్పిటల్ ఏరియాలోని శివాలయాలు, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, రుద్రంపూర్‌లోని సీతారామాలయం, గౌతంపూర్, సూజాతనగర్‌లోని సోమేశ్వరాలయం తదితర శివాలయాల్లో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బూడిదగడ్డలోని శివాలయాన్ని ఓఎస్‌డీ పంకోజ్ పరితోష్ దంపతులు దర్శించుకుని శివుడికి పంచామృతాభిషేకాలు, పూజలు నిర్వహించారు.



పూజలు చేస్తున్న భట్టి దంపతులు

మహాశివరాత్రిని పురస్కరించుకొని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాచలంలోని పవిత్ర గోదావరి నదిలో బుధవారం భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. భక్తులు సంకల్పం, వారి పితృ దేవతలకు పిండ ప్రదానం నిర్వహించారు.

గోదావరి నదీ తీరాన ఉన్న వల్లీదేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయాన్ని, భద్రాద్రి దేవస్థానం అనుబంధ ఆలయమైన అన్నపూర్ణదేవిసమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, ఉమా రామలింగేశ్వరస్వామి, అమర రామలింగేశ్వరస్వామి ఆలయం, అంబాసత్రంలోని పర్వత వర్ధిని రామలింగేశ్వరస్వామి వారి ఆలయం, ఐటీడీఏ ప్రాంగణంలోని జయదుర్గ సహిత పంచముఖ విశ్వేశ్వరస్వామి ఆలయం, ఆర్టీసీ ఇన్‌గేటు వద్ద ఉన్న దుర్గా మల్లేశ్వర స్వామి వారి ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శివాలయాల్లో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ దంపతులు ఎఎస్‌పీ విక్రాంత్‌కుమార్ సింగ్, భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి పాల్గొన్నారు.

శివాలయం జాతరలో ట్రాఫిక్ జామ్



కల్లూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) కల్లూరులోని కాశ్మీర మహాదేవర క్షేత్రం (శివాలయం) జాతర సందర్భంగా ఆలయ దర్శన కోసం వెళ్లతున్న భక్తులకు బుధవారం రాత్రి విపరీతంగా ట్రాఫిక్ జామ్ అయింది. రాత్రి 7 గంటల నుంచి కల్లూరు మండల పరిసర గ్రామాల నుంచి భక్తులు వేలాదిగా తరలి రావటంతో ఈ పరిస్థితి ఏర్పడింది. స్థానికంగా సంతాన వేణుగోపాలస్వామి వారి వీధి వైపున గల జంక్షన్ నుంచి విపరీతంగా వాహనాలు నిలిచి పోయాయి. ఈ రహదారి వన్‌వే కావటం భక్తుల రాక పోకలకు అంతరాయం కలిగింది. గంటల తరబడి శివాలయం వెళ్లే రహదారిపైన వాహనాలు నిలిచినాయి. కల్లూరు నుంచి శివాలయానికి చేరుకోవాలంటే వాస్తవంగా 10 నిమిషాలు పడుతుంది. అందుకు భిన్నంగా ట్రాఫిక్ జామ్‌తో గంటల తరబడి భక్తులు ఇబ్బందులు పడ్డారు.

హరహర మహాదేవ

మారుమోగిన స్నానాల లక్ష్మీపురం.....



జాతరలో భక్తులకు అభివాదం చేస్తున్న భట్టి, నందిని దంపతులు

వైరా, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్నానాల లక్ష్మీపురం శివన్మారణతో మారుమోగింది. మహాశివరాత్రి పర్వదినమైన బుధవారం స్నానాల లక్ష్మీపురానికి భక్తజనం పోటెత్తింది. వేకువజాము నుంచే వేలాదిగా తరలివచ్చిన భక్తులు వైరా నదిలోని రామగుండంలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఆతర్వాత శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశా రు. ఇదే గ్రామానికి చెందిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, నందిని దంపతులు ఈ జాతర మొత్తం కలియతిరిగి ఆలయంలో పూజలు చేశారు. ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురామిరెడ్డి పూజలు చేసి కొంత మంది యువకులు ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ప్రారంభించారు. ఎ మ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, లలిత దంప తులు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వర రావు ఆయన కుటుంబసభ్యులు, కార్పొరేషన్ చైర్మన్లు రాయల నాగేశ్వరావు, మువ్వా విజయ్‌బాబు, నాయుడు సత్యనారాయణ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, టీపీసీసీ కార్యదర్శి నూతి సత్యనారా యణ, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ పూజలు చేశారు. వైరా ఏసీపీ ఎంఏ. రెహ్మా న్ పర్యవేక్షణలో వైరా సీఐ ఎన్.సాగర్ పర్యవేక్షణలో 120మందికిపైగా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. మధిర ఆర్టీసీ డిపో వారు ప్రత్యేక బస్సులు నడిపారు.





అలంకారంలో మహాశివుడు

కూసుమంచి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): హరహర మహాదేవ శంభోశంకర, ఓం నమః శివాయ... అంటూ శివనామస్మరణతో కూసుమంచి శివాలయం మార్మోగింది. మహాశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామివారికి మహాన్యాస ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శేషగిరిశర్మ, బాలాజీ తీర్థప్రసాదాలు అందించారు. మహాశివరాత్రి పురస్కరించుకుని ఆలయంలో మహాదేవుని దర్శించుకునేందుకు ఖమ్మం జిల్లా నుంచే కాకుండా సరిహద్దు సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్ జిల్లా పరిసరప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చారు. గర్భగుడిలో మహాదేవునికి అలంకరణ చేయడంతో, ఆలయం బయటిభాగంలో శివలింగానికి క్షీరాభిషేకం చేసుకున్నారు. ఆలయ ఈవో శ్రీకాంత్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు జరిగాయి.

శివాలయంలో ప్రముఖుల పూజలు

మహాశివరాత్రిని పురస్కరించుకుని ఎంపీ రఘురాంరెడ్డి, జిల్లా జడ్జి పార్థసారథి, రాష్ట్ర గిడ్డంగులసంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూధన్, పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయ ఇన్‌చార్జి దయాకర్‌రెడ్డి, బీజేపీ ఖమ్మం పార్లమెంట్ అధ్యక్షుడు తాండ్ర వినోద్‌రావు, మాజీ డీసీపీ ప్రతాపరెడ్డి, పలువురు అధికారులు, నాయకులు పాల్గొని పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కూసుమంచి సీఐ సంజీవ్ కూసుమంచి, తిరుమలాయపాలెం ఎస్ఐలు నాగరాజు, శ్రీధరాచారి, జగదీష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

శివపార్వతుల కల్యాణం కమనీయం

కూసుమంచి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): కూసుమంచి గణపేశ్వరాలయంలో బుధవారం అర్థరాత్రి శివపార్వతుల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. మహాశివ రాత్రిని పురస్కరించుకుని ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మండపంలో కల్యాణం జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. కల్యాణోత్సవంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక వస్త్రాలు సమర్పించి లోకకల్యాణాన్ని కాంక్షిస్తు విశ్వశాంతి, ప్రజాశ్రేయస్సుకు సంబంధించి సకల శుభాలు కలగాలని అర్చకస్వాములు సంకల్ప పఠం పఠించారు. కల్యాణోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయం ఈవో శ్రీకాంత్, శివమాలాధారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు అకట్టుకున్నాయి.



శివపార్వతుల కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

కల్యాణానికి విచ్చిన భక్తులకు పులిహార ప్రసదం అందజేశారు.

జక్కేపల్లి బాలకోటేశ్వరస్వామి ఆలయంలో

కూసుమంచి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి సందర్భంగా కూసుమంచి మండలం జక్కేపల్లిలోని శ్రీబాలకోటేశ్వస్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. సూర్యాపేట జిల్లా నడిగూడెం, మునగాల మండలాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో ఆటోల్లో, ట్రాక్టర్లలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

నీలాద్రీశ్వర ఆలయంలో..



నీలాద్రీశ్వరాలయం వద్ద బారులు తీరిన భక్తులు

సత్తుపల్లిరూరల్/పెనుబల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రమైన నీలాద్రీశ్వరాలయంలో మహాశివరాత్రి సందర్భంగా బుధవారం 1.50లక్షల మంది భక్తులు స్వామివారికి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తులకు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆలయ ఈవో పాకాల వెంకటరమణ, కమిటీ చైర్మన్ చీకటి చిన్న నరసింహారావుల ఆధ్వర్యంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లుచేశారు. ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ కుమార్, కొప్పుల చంద్రశేఖర్‌లు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కల్లూరు ఏసీపీ అనిశెట్టి రఘు ఆధ్వర్యంలో రూరల్ సీఐ ముత్తులిం గం, పట్టణ సీఐ టీ.కిరణ్‌ల పర్యవేక్షణలో డివిజన్‌లోని పోలీసులు బందోబస్త్ నిర్వహించారు. ప్రముఖ జ్యోతిష్యవేత్త బోదనపు విజయకుమార్ ఆధ్వర్యంలో నేపాల్ నుంచి ప్రత్యేకంగా సేకరించిన 2.25లక్షల రుద్రాక్షలతో నిర్మించిన 14అడుగుల శివలింగానికి అభిషేకం, హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుపతికి చెందిన అర్చకులు, శివభక్తులు పాల్గొన్నారు.

మహిమగల దేవుడు తీర్థాల సంగమేశ్వరుడు....

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): శివనామస్మరణతో తీర్థాల పుణ్యక్షేత్రం మారుమోగింది. జాతరను మంగళవారం రాత్రి 12 గంటలకు సంఘమేశ్వరస్వామికి తహసీల్దార్ పిల్లి. రాంప్రసాద్ ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేసి జాతరను ప్రారంభించారు. త్రివేణి సంఘమంలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. క్యూలైన్లలో భక్తులకు తొక్కిసలాట ఏర్పడింది. కాగా వ్యాపారులు అధిక ధరలు పెంచి భక్తుల విస్వాసాన్ని సోమ్ము చేసుకున్నారు. గతంలో స్వామివారి కి చెందిన అభిషేకం లడ్డూ గతంలో రూ.50 ఉండగా ఈ ఏడాది ఏకంగా రూ.100 కు పెం చారు. కామంచికల్ నుంచి రామన్నపేట వరకు భారీగా ట్రాఫిక్ జాం అయింది. బస్సులు రాకపోవడంతో బస్‌స్టాప్‌లలో భక్తులు బస్సుల కోసం నిరీక్షించారు. రూరల్ ఏసీపీ తిరపతిరెడ్డి తన సిబ్బందితో ట్రాఫిక్ ను నియంత్రించారు.

సంఘమేశ్వరస్వామిని ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి, ఐడిసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జీ తుంబూరి దయాకర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మద్ది మల్లారెడ్డి, కిషోర్ రెడ్డి, చంద్రశేకర్, తదితరులు స్వామివారిని ధర్శించుకున్నారు.



జాతరకు పోటెత్తిన భక్త జనం

మోతెగడ్డ వీరభద్రస్వామి ఆలయంలో..

బూర్గంపాడు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): బూర్గంపాడు మండల పరిదిలోని మోతెగడ్డలో కొలువై ఉన్న వీరభద్రస్వామి దేవాలయంలో బుధవారం మహాశివరాత్రి వేడుకలు కనులపండుగగా నిర్వహించారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని మోతెగడ్డ వీరభద్రస్వామి దర్శనానికి భక్తులు పొటెత్తారు. శివరాత్రి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావరిలో నీటి ప్రవహం తక్కువుగా ఉండడంతో భక్తులు నడుచుకుంటూ గోదావరి నదిని దాటి ఆలయానికి చేరుకున్నారు. పలువురు భక్తులు మాత్రం నాటుపడవల ద్వారా గోదావరిని దాటి ద్వీపకల్పంలో ఉన్న ఆలయానికి చేరుకున్నారు. భక్తులు గోదావరిలో స్నానాలు ఆచరించి దర్శనానికి బారులు తీరారు. కాగా, ఎండ తీవ్రతతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భక్తులకు కనీస వసతులు కల్పించలేదని ఆరోపిస్తూ అధికారుల తీరుపై మండిపడ్డారు.

ఉత్సవాలను పురస్కరించుకుని మోరంపల్లి బంజర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. నాటుపడవల ద్వారా ఆలయానికి చేరుకున్న పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. బూర్గంపాడులోని గోవిందమాంబా సమేత వీరబ్రహ్మేంద్ర



బూర్గంపాడులో వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం జరుపుతున్న దృశ్యం

స్వామి వారి ఆలయంలో మండల విశ్వబ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెలంగాణ సరిహద్దు ఏపీలోని ఏలూరు జిల్లా కుక్కునూరు మండ లం పెదరావిగూడెం గ్రామంలోని గోదావరి ఒ డ్డున ఉన్న శ్రీ పార్వతి సమేత కేదారేశ్వర స్వా మివార్ల ద్వాదశ జ్యోతిర్లంగ క్షేత్రానికి భక్తులు బారులు తీరారు. మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు తమ గ్రామాల నుంచి సుమారు 10నుంచి 15కిలోమీటర్ల దూ రంలో ఉన్న ఆలయానికి పాదయాత్రగా వెళ్లి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



కూసుమంచిలో పూజలు చేస్తున్న వద్దిరాజు రవి



సత్తుపల్లిలో పూజలు చేస్తున్న సండ్ర



సత్తుపల్లిలో పూజల్లో పాల్గొన్న ఎంపీ రఘురాంరెడ్డి



వీరభద్ర స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పాయం



కూసుమంచి పూజల్లో పాల్గొన్న తాత మధు, కందాళ

నక్సల్స్ డంప్‌లో నేత్ర పరీక్షల పరికరం

» అడవుల్లో డంప్‌ను గుర్తించిన కేంద్ర బలగాలు



డంప్‌లోని సామగ్రిని ప్రదర్శిస్తున్న బలగాలు

చర్ల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా మెట్టగూడ, పాలగూడ అడవుల్లో మావోయిస్టుకి చెందిన భారీ డంప్‌ని బుధవారం కేంద్రబలగాలు గుర్తించాయి. డంప్‌లో మావోయిస్టు పార్టీకి చెందిన వస్తువులు ఉన్నాయి. ముఖ్యంగా నేత్ర పరీక్షలు చేసే పరికరం బలగాలకు దొరికింది. దాంతో పాటు లెన్స్‌లు కూడా బలగాలు గుర్తించాయి. మావోయిస్టులకు కంటి పరీక్షలు చేయడానికి పరికరాన్ని తెప్పించారని బలగాలు చెబుతున్నాయి. ఇప్పటి వరకు దొరికిన డంప్‌ల్లో కంటి పరీక్షా యంత్రం దొరకడం మొదటిసారని భద్రతా బలగాల అధికారులు అంటున్నారు.

ఇనుమును కట్ చేసే యంత్రాన్ని కూడా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. బలగాల రాకను చూసి మావోయిస్టులు తప్పించుని పోయారని వారికోసం కూబింగ్ జరుగుతుందని సుకుమా పోలీసులు తెలిపారు.

విద్యార్థినికి అసభ్య సందేశాలు..

» కాంట్రాక్ట్ అధ్యాపకుడి నిర్వాకం



ఖమ్మం ఖానాపురంహవేలి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని ఓ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినికి అదే కళాశాల కాంట్రాక్ట్ అధ్యాపకుడు ఫోన్ కొనిచ్చి అసభ్య సందేశాలు పంపతున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విషయం తెలిసిన తల్లిదండ్రులు వెంటనే కళాశాల ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ప్రిన్సిపాల్ సదరు అధ్యాపకుడిని విచారించేందుకు ప్రయత్నించగా హైదరాబాద్‌కు పారిపోయినట్లు తెలిసింది. ఈ విషయమై కళాశాల ప్రిన్సిపాల్‌ను వివరణ అడుగగా విద్యార్థిని తల్లితండ్రులు ఫిర్యాదు చేసిన విషయం నిజమేనని తెలిపారు. కాంట్రాక్ట్ అధ్యాపకుడితో మాట్లాడేందుకు గత రెండు రోజులుగా ప్రయత్నించామన్నారు. అతడు అందుబాటులో లేకపోవటంతో ఫోన్‌లో సంప్రదించగా స్పందించటంలేదని తెలిపారు. బుధవారం మధ్యాహ్నం ఓ సారి ఫోన్ ఎత్తి రేపు కాలేజీకి వస్తానని, అప్పుడు మాట్లాడుదాం అని ఫోన్ పెట్టాశాడని ప్రిన్సిపాల్ తెలిపారు.

అదే కళాశాలలో 2018లో సదరు అధ్యాపకుడు ఓ బాలికను లైంగికంగా వేధించాడనే ఆరోపణలు వచ్చాయని తెలిసింది. అప్పుడు జిల్లా ఇంటర్మీడియట్ అధికారులు విచారణ చేశారు. కానీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. అదే అధ్యాపకుడు తిరిగి మరో విద్యార్థినికి అసభ్య సందేశాలు పంపిస్తూ తల్లిదండ్రులకు దొరికాడు.

ట్రాక్టర్ పల్టీ ఘటనలో
చికిత్స పొందుతున్న మహిళ మృతి

బోనకల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): బోనకల్ గ్రామం లో గత నెల 31వ తేదీన కూలీలు ఎక్కిన ట్రాక్టర్ పల్టీ కొట్టిన ఘటనలో యార్లగడ్డ వరమ్మ మృతి చెందింది. 13 మందికి తీవ్ర గాయాలైన విషయం తెలిసిందే. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బోనకల్‌కు చెందిన లింగం నాగమణి (54) బుధవారం మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు రావట్ల సత్యనారాయణ, నాయకులు నందమూరి సత్యనారాయణ, గంగుల శ్రీను, బండి రామారావు, రావట్ల వెంకటాచారి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, బీఆర్ఎస్ నాయకుడు రెడ్డిబోయిన ఉద్దండు తదితరులు సందర్శించి నివాళులర్పించారు. నాగమణికి టీడీపీ సభ్యత్వం ఉండటంతో ఆమె మృతదేహంపై టీడీపీ పతాకాన్ని ఉంచి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. పార్టీ తరఫున ప్రమాద బీమాను అందించేలా కృషి చేస్తామని నాయకులు తెలిపారు.





సంతాపం తెలుపుతున్న టీడీపీ నాయకులు, ఇన్‌సెట్‌లో నాగమణి(ఫైల్)

నిర్లక్ష్యానికి రెండు నిండు ప్రాణాలు బలి

ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యానికి రెండు నిండు ప్రాణాలు గాలిలో కలిశాయి. పలువురు కూలీలు తీవ్రంగా గాయపడి మంచానికే పరిమితమయ్యారు. బతుకుదెరువు కోసం కూలీలు పనికి వెళ్తున్న క్రమంలో డ్రైవర్ బాధ్యతా రహిత్యం వారి పాలిట శాపంగా మారింది. ప్రమాదం జరిగిన రోజునే వరమ్మ మృతి చెందగా, చికిత్స పొందుతూ మరో మహిళ నాగమణి మృతి చెందడంతో గ్రామంలో మరోసారి విషాద చాయలు అలుముకున్నాయి. తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న కూలీలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. బాధిత కూలీల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంటి తాళం పగులగొట్టి చోరీ

» 2 తులాల బంగారం, రూ. 50వేల నగదు అపహరణ

జూలూరుపాడు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచినేనిపేటతండా పంచాయతీ పరిధిలోని జేత్యాతండా గ్రామంలో బాణోత్ బాలు ఇంట్లో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బుధవారం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గత కొన్ని నెలల క్రితం బాలు సోదరుడు సోమా మృతి చెందాడు. శివరాత్రిని పురస్కరించుకుని మొక్కును చెల్లించుకునేందుకు బాలు, అతని భార్య లక్ష్మి ఇంటికి తాళం వేసి మంగళవారం రాత్రి 10గంటల సమయంలో వైరా మండలం స్నానాల లక్ష్మీపురంలోని శివాలయానికి వెళ్లారు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు అతడి ఇంటి తలుపుకు వేసిన తాళాన్ని పగలగొట్టి లోపలకు వెళ్లారు. ఇంట్లోని సూట్‌కేసును పగలగొట్టి అందులో ఉన్న రూ. 50వేల నగదుతో పాటు రెండు తులాల బంగారాన్ని ఎత్తుకుని వెళ్లారు. తెల్లవారుజామున 5 గంటల సమయంలో బాలు, అతడి భార్య ఇంటికి వచ్చేసరికి తలుపు పగలగొట్టి ఉండటాన్ని గమనించారు. లోపలికి వెళ్లి చూడగా సూట్‌కేసు తెరిచి ఉండటంతో పాటు అందులోని దుస్తులు చెల్లాచెదురుగా పడిఉన్నాయి. దీంతో చోరీ జరిగినట్లు వారు గుర్తించి పోలీసులకు సమాచారాన్ని అందించారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ బాదావత్ రవి సందర్శించి వివరాలను నమోదు చేసుకుని చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. సంఘటన స్థలానికి క్లూస్ టీం చేరుకుని వేలిముద్రలను సేకరించారు. బాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు.



చెల్లాచెదురుగా ఉన్న సామగ్రి

కోడిపందేల స్థావరంపై దాడి

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): కోడిపందేల స్థావరంపై బుధవారం సాయంత్రం పోలీసులు దాడులు నిర్వహించారు. వాగొడ్డుగూడెం సమీపంలో గల కొత్తగంగారం గ్రామానికి దగ్గరలో కొందరు కోడి పందేలను నిర్వహిస్తున్నారు. సమాచారం మేరకు ఎస్ఐ యయాతిరాజు తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఏడు ద్విచక్ర వాహనాలను, ఆరు కోడి పుంజులను, రూ.1200 నగదుతో పాటు ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఎస్ఐ యయాతిరాజు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని దురదపాడు నుంచి ఆసుపాకకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. సమాచారం మేరకు ఎస్ఐ యయాతిరాజు తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి మామిళ్లవారిగూడెం వద్ద రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. పట్టుకున్న ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు వివరించారు.

విద్యుదాఘాతంతో పూరిల్లు దగ్ధం

జూలూరుపాడు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో పూరిల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని సాయిరాంతండా గ్రామంలో బుధవారం జరిగింది. తండాకు చెందిన గుగులోత్ వీరు పని నిమిత్తం జూలూరుపాడుకు వెళ్లాడు. అతడి భార్య సాల్కు కూలీ పనికి వెళ్లింది. కాగా ఈ క్రమంలో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. దీంతో సమాచారాన్ని గ్రామస్థులు ఫోన్ ద్వారా వీరుకు అందించారు. మంటలను ఆర్పేందుకు గ్రామస్థులు ప్రయత్నించినప్పటికీ పూరిల్లు పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో 4తులాల బంగారం, రూ. 90వేల నగదు, ఇతర వస్తువులు కాలిపోయాయి.

ఎన్నెస్పీ కాలువలో పడి వ్యక్తి గల్లంతు

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఎన్నెస్పీ కాలువలో పడి వ్యక్తి గల్లంతు అయిన సంఘటన ఏదులాపురం మున్సిపాలిటి పరిధిలోని పల్లెగూడెం గ్రామంవద్ద బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మున్సిపాలిటి పరిధిలోని నాయుడుపేట ఇందిరమ్మ కాలనీకి చెందిన గోలి అశోక్ మహాశివరాత్రి సందర్భంగా స్నేహితులతో కలిసి పార్టీ చేసుకున్నాడు. సాయంత్రం అశోక్ అతని స్నేహితుడు గురుస్వామి ఇద్దరు కలిసి పల్లెగూడెం వద్ద ఎన్నెస్పీ కాలువలో స్నానానికి వెల్లారు. ప్రమాదవశాత్తూ అశోక్ కాలు జారి కాలువలో పడి గల్లంతయ్యాడు. గల్లంతయిన అశోక్ ఆచూకీ కోసం వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. జరిగిన ఘటనపై అశోక్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్పెక్టర్ రాజు తెలిపారు..



హర..హర.. మహాదేవ

భక్తి ప్రపత్తులతో మహా శివరాత్రి

ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు

తెల్లవారుఝామునుంచే ప్రత్యేక అభిషేకాలు

మహా శివరాత్రి పర్వదినాన్ని బుధవారం ప్రజలు భక్తి ప్రపత్తులతో నిర్వహించుకున్నారు. తెల్లవారు ఝామునుంచే ఆలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల వద్ద భక్తులు బారులుదీరారు. పర్వదినాన్ని పురస్కరించుకుని పలువురు ఉపవాసాలు ఉండి, మొక్కులు చెల్లించుకున్నారు.


తీర్థాలలో ఎంపీ రఘురాంరెడ్డి పూజలు


ఎస్పీ ఆఫీస్ రోడ్డు శివాలయంలో మేయర్ పూజలు


తీర్థాలలో జాతరను ప్రారంభిస్తున్న రూరల్ ఎంఆర్వో


నిజాంపేట భక్తాంజనేయ స్వామి దేవస్థానంలో


గుంటు మల్లేశ్వర ఆలయంలో భక్తుల బారులు


పూజలు చేస్తున్న యువతులు


గుంటుమల్లేశ్వర ఆలయంలో అభిషేకం


కూసుమంచిలో భక్తుల బారులు


కూసుమంచిలో ఎంపీ వద్దిరాజు పూజలు


ఎస్పీ ఆఫీసు రోడ్డు శివాలయంలో..


తీర్థాలలో భక్తుల రద్దీ


తీర్థాలలో శివుడికి అభిషేకం


తిరుమలాయపాలెంలో హోమం


ఎస్పీ ఆఫీస్ రోడ్డు శివాలయంలో కల్యాణం


తీర్థాలలో యువతుల స్నానం


తీర్థాల వద్ద ట్రాఫిక్ జాం


రాయల నాగేశ్వరరావు పూజలు


కల్యాణానికి హాజరైన భక్తులు


గుంటుమల్లన్న ఆలయంలో..


కూసుమంచిలో ఎమ్మెల్సీ మధు, మాజీ ఎమ్మెల్యే కందాళ


జక్కేపల్లిలో ఉత్తమ్ పద్మావతి పూజలు


కూసుమంచి శివాలయంలో కల్యాణం


తీర్థాలలో గాజుల విక్రయం


ఖమ్మంలో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో..

కేలండర్ ఆవిష్కరణ


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): కామాక్షి కోళ్ల వర్తక సంక్షేమ సంఘం పట్టణ చికెన్ సెంటర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పారా సత్యనారాయణ ఆధ్వర్యంలో కామాక్షి కోళ్ల వర్తకుల సంక్షేమ సంఘం ఖమ్మం పట్టణం చికెన్ సెంటర్స్ అసోసియేషన్ 2025 క్యాలెండర్లను కలెక్టర్ ముజమిల్ ఖాన్, నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు చికెన్‌ను తింటున్న వాళ్లు 45 డిగ్రిల ఎక్కువ వేడిలో ఉడికించి తినాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పారా సత్యనారాయణ మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా బర్డ్‌ఫ్లూగా వస్తుందని దాన్ని కొక్కిర రోగం అంటారన్నారు. 2004లో డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో వచ్చినప్పుడు కూడా చికెన్ మేల నిర్వహించి ప్రజల్లో చికెన్ తినడంపై అవగాహన కల్పించారని అన్నారు. అలాగే తాము కూడా పదివేల మందికి చికెన్ పకోడీ , చికెన్ ఫ్రై, రెండు గుడ్లను పంచే ప్రోగ్రాం త్వరలో సర్దార్ పటేల్ స్టేడియంలో కానీ, పెవిలియన్ గ్రౌండ్లో కానీ ఖమ్మం నగరం పట్టణంలో స్టాల్స్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఇబ్రహీం, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, కోశాధికారి రాము, జాయింట్ సెక్రటరీ జనార్దన్ రావు, అబ్దుల్ నబీ, గౌరవ సలహాదారులు జానీ మియా, ఈసీ మెంబర్ ఎస్‌కే షకీల్, ఆకుల మధుపాల్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, ముత్తల పాటి రాము, సత్యనారాయణ, హనుమంతరావు, కల్వకుంట్ల వాసు, మధు, నరేష్, శ్రీనివాస్, బాబ్జి, మధు, మున్నా, ఆర్.హరి, శేషగిరిరావు, వీరభద్రరావు, ఎస్.కె యాసిన్, సిహెచ్ సాంబశివరావు, రాధాకృష్ణ, వేస్క ఖాజా, ప్రవీణ్ కుమార్, అమ్మ రమేష్, స్నేహ కృష్ణ, ఎస్వీఎస్ అశోక్, ఎస్.కె ఇబ్రహీం, వేస్క ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి కరుణగిరి ఉత్సవాలు

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మున్సిపాలిటి పరిధిలోని కరుణగిరి పుణ్యక్షేత్రంలో కరుణగిరి ఉత్సవాలు గురువారం ప్రారంభం అవుతాయని డైరెక్టర్ ఫాదర్ మాథ్యూ వరప్రసాద్ రాజు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా కరుణగిరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతు కరుణగిరి ఉత్సవాలు గురువారం నుంచి మార్చి 2వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ఈ ఉత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు హాజరవుతారన్నారు. ఉత్సవాలకు సంబంధించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసిన్లు తెలిపారు.

వైభవంగా వైద్యనాధ స్వామి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


హాజరైన భక్తులు

నేలకొండపల్లి, ఫిబ్రవరి26(ఆంధ్రజ్యోతి):నేలకొండపల్లిలోని అతి పురాతనమైన, వందల ఏళ్ల చరిత్ర కలిగిన వైద్యనాధ స్వామి ఆలయంలో మహా శివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం తెల్లవారుఝాము నుంచి శివాలయాలకు భక్తులు పోటెత్తారు. శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. తీర్థప్రసాదాలను వితరణ చేసారు. కాత్యానాయకీ సమేత వైద్యనాధస్వామి కల్యాణం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. అర్చకులు పురాణం దివాకర్, జక్కేపల్లి పాపయ్యశాస్త్రిలు కల్యాణం నిర్వహించారు. కల్యాణానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాను వితరణ చేసారు. గత వంద సంవత్సరాలుగా వైద్యనాధస్వామి ఆలయం వద్ద కాత్యానాయకీ సమేత వైద్యనాధస్వామి కల్యాణం నిర్వహించటం ఆనవాయితీగా వస్తున్నది. కల్యాణానికి ముందు వివిధ జిల్లాల నుంచి వేల సంఖ్యలో వచ్చిన భక్తులు తమ మైలలు, మొక్కులు తీర్చుకుని వైద్యనాధుని దర్శనం చేసుకుని కల్యాణంలో పాల్గొన్నారు. కల్యాణాన్ని పురస్కరించుకుని వివిధ స్వచ్ఛంద సంస్థలు భక్తులకు పులిహోరతో పాటుగా చల్లని తాగునీటిని పంపిణీ చేసాయి. భక్తరామదాసు సర్వీస్ సొసైటీ, పట్టణ వర్తక సంఘం, వాసవీ క్లబ్స్, ఆర్యవైశ్యులు, రియల్ ఎస్టేట్ సంఘం, యువజన కాంగ్రెస్, కందాళ యువసేన సంస్థలు భక్తులకు పులిహోర, తాగునీటిని అందించారు. వైద్యనాధ స్వామి కల్యాణాన్ని వీక్షించి భక్తులు తరించారు.

ఓరుగల్లులో ఖమ్మం కళాకారుల..

నృత్య ప్రదర్శన

ఖమ్మం ఖానాపురంహవేలి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వరంగల్ వేయి స్తంభాల గుడిలో బుధవారం ఖమ్మం కళాకారులు నృత్య ప్రదర్శన ఇచ్చారు. శివరాత్రి వేడుకల సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో ఖమ్మం అభినయ రుద్ర నాట్యాలయ కళాకారులు భరతనాట్యం ప్రదర్శించారు. నాట్య గురువు ఫణిల్ కణతాల ఫనిల్ శిష్య బృందం ప్రదర్శించిన నృత్యాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.


ప్రదర్శన ఇచ్చిన నృత్య కళాకారులు

అసంఘటిత కార్మికులను ఆదుకోవాలి

తిరుమలాయపాలెం,ఫిబ్రవరి26(ఆంధ్రజ్యోతి): అ సంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేసి ఆదుకోవాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకులు కూ సు అప్పారావు తెలిపారు. బుధవారం మండలంలోని దమ్మాయిగూడెంలో ఆపార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈసందర్బంగాఆయన మాట్లాడుతూ సన్న, చిన్నకారురైతులు, అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులకు పనికితగిన వేతనం ఇవ్వాలన్నారు. ఈనెల 28న డిల్లీలో సదస్సుజరుగుతుందని, దీనిని విజయవంతం చేయాలన్నారు ఈకార్యక్రమంలో రేపాకుల శివలింగం, తిమ్మిడి హనుమంతరావు, ఆరెంపుల వెంకన్న, ఎస్.వెంకటేశ్వర్లు, తదితరులున్నారు.



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం



ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఏదులాపురం మున్సిపాలిటి పరిధిలోని జలగంనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికలకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ పోలింగ్ కేంద్రంలో మొత్తం 284 ఓట్లు ఉన్నాయి. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఈ పోలింగ్ కేంద్రంలో పీవో, ఏపీవో, 2 ఓపీవోలతో పాటు మైక్రో అబ్జర్వర్ తదితరులు విధులు నిర్వహించనున్నారు.

తిరుమలాయపాలెంలో..

తిరుమలాయపాలెం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. తిరుమలాయపాలెం ప్రభుత్వ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 34 మంది ఓటర్లకుగాను పోలింగ్ కేంద్రం ఏర్పాటుచేశారు. పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు షామియానాలు, తాగునీటి సౌకర్యం ఏర్పాటుచేశారు. ఎటువంటి ఘర్షణలూ జరగకుండా ఎస్ఐ జగదీష్ బందోబస్తు ఏర్పాటుచేశారు.



మధిరటౌన్‌లో పూజలు చేస్తున్న డిప్యూటీ సీఎం దంపతులు



కల్లూరులో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి



కారేపల్లిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

ఘనంగా శివరాత్రి వేడుకలు



మధిరటౌన్, ఫిబ్రవరి26(ఆంధ్రజ్యోతి): శివరాత్రి సందర్భంగా మధిరలోని శ్రీగంగా పార్వతీ సమేత శ్రీ మృత్యుంజేయ స్వామి దేవాలయంలో బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైరా నదిలో స్నానాలు ఆచరించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆయన సతీమణి నందిని శివునికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. రాహుల్ గాంధీ గోత్రనామాలతో అర్చన చేయించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో జగన్మోహనరావు, అర్చకులు రాయప్రోలు సత్యనారాయణ భక్తులు పాల్గొన్నారు.

ముదిగొండలో....

ముదిగొండ, ఫిబ్రవరి26(ఆంధ్రజ్యోతి): మండలం వల్లాపురంలోని మల్లిఖార్జునస్వామి ఆలయంలో బుధవారం ఉపముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క దంపతులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుపువ్వాళ్ల దుర్గాప్రసాద్, కొమ్మినేని రమేష్‌బాబు, నాయకులుపసుపులేటి దేవేంద్రం, మల్లెల అజయ్, ఉసికల రమేష్, రవీందర్‌రెడ్డి, గుడిపుడి బుచ్చిరామయ్య, ఝూన్సీ, రమేష్, రామకృష్ణ, అస్గర్ తదితరులున్నారు.

కొణిజర్లలో...

కొణిజర్ల, ఫిబ్రవరి26(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా బుధవారం మండలంలోని శివాలయాలు భక్తుల శివనామస్మరణంతో మారుమోగాయి. పల్లిపాడు స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయం, కొణిజర్ల కట్టుబోగ లింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పోటెత్తారు. పల్లిపాడు ఆలయంలో ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మునిసిపల్ చైర్మన్ సూతగాని జైపాల్, రాంపుడి రోశయ్య, ఆలయ చైర్మన్ లత తదితరులు పూజలో పాల్గొన్నారు. తనికెళ్ళ శ్రీచంద్ర మౌళేశ్వరస్వామి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు తాంర్ర వినోద్‌రావు పాల్గొన్నారు.

కారేపల్లిలో...

కారేపల్లి ఫిబ్రవరి26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలంపల్లి గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా కోటిలింగాల జాతరకు బుధవారం భక్తులు భారీగా తరలివచ్చారు. శివలింగానికి పూజలు చేశారు. ఆలయ చైర్మన్ అలెం వెంకటేశ్వర్లు, రూరల్ సీఐ బి.తిరుపతి రెడ్డి, ఎస్ఐ ఎన్.రాజారాం ఏర్పాట్లను పర్యవేక్షించారు. అదే విధంగా గేటుకారేపల్లి గ్రామంలో గల రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ పర్సా పట్టాభీరామారావు ఉన్నారు.

సత్తుపల్లిరూరల్

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుడిపాడు, వెంగళరావు నగర్‌తో పాటు మండలంలోని సదాశివునిపేట, బేతుపల్లి, కాకర్లపల్లి, బుగ్గపాడులోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. బుగ్గపాడు విశ్వ ధర్మక్షేత్రంలోని శివాలయంలో 108మంది దంపతులచే శివకల్యాణం, అఖండ శివనామ స్మరణ భజన, లింగోద్భవ సమయం, భస్మాభిషేకం, త్రిశూలస్నానం నిర్వహించగా 50అడుగుల ఎత్తులో ఏర్పాటుచేసిన ప్రభ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సత్తుపల్లి ఆర్టీసీ డిపో నుంచి నీలాద్రీశ్వరాలయం వరకు 25ప్రత్యేక బస్సులను నడిపించినట్లు ఆర్టీసీ డీఎం రాజ్యలక్ష్మి తెలిపారు. ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్‌లు ఆయా ఆలయాలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అదేవిధంగా గంగారంలోని 15వ బెటాలియన్‌లో ఏర్పాటుచేసిన అన్నదానం కార్యక్రమాన్ని కమాండెంట్ పీజేపీ సీ.చటర్జీ ప్రారంభించారు.

తల్లాడలో..

తల్లాడ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలంలోని నూతనకల్‌లో నాగకమలేశ్వర దేవాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానాన్ని ఎమ్మెల్యే రాగమయి ప్రారంభించారు. తల్లాడలోని రామలింగేశ్వరస్వామి దేవాలయం, మిట్టపల్లిలోని మల్లికార్జునస్వామి దేవాలయం, కలకొడిమలోని కోదండ రామాలయంలో కలకోడిమేశ్వరస్వామిలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

ఏన్కూరులో...

ఏన్కూరు, ఫిబ్రవరి26(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పండుగ సందర్భంగా మండలంలోని ఏన్కూరు, బురదరాఘవాపురం శివాలయాలు బుధవారం భక్తులతో కిటకిటలాడాయి.

కల్లూరులో...

కల్లూరు, ఫిబ్రవరి26 (ఆంధ్రజ్యోతి) కల్లూరులోని శ్రీ కాశ్మీర మహాదేవర క్షేత్రం (అప్పయ్యస్వామి శివాలయం), చెన్నూరులోని శ్రీ గంగా శివపార్వతుల (శివాలయం), చిన్నకోరుకొండిలోని భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి ఆలయంలో శివరాత్రి జాతరను పురస్కరించుకొని పలు ప్రాంతాల నుంచి ఆలయాలకు భ క్తులు పోటెత్తారు. ఎమ్మెల్యే మట్టా రాగమయి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రత్యేక పూజలు చేశారు. చెన్నూరులోని ఆయలంలో ఎమ్మెల్యే రాగమయి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ ఈవో ఎస్‌విడి ప్రసాద్ పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.



కొణిజర్లలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి



కల్లూరులోని శివాలయంలో పూజలు చేస్తున్న సండ్ర



కాకర్లపల్లిలో దయానంద్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



ఏన్కూర్‌లో..



తల్లాడలో...



కారేపల్లిలో...



వైరా నదిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



ముదిగొండలో హాజరైన భక్తులు



సత్తుపల్లి శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్‌కు సర్వసిద్ధం



కల్లూరులో మాట్లాడుతున్న ఆర్డీవో రాజేంద్రగౌడ్

కల్లూరు, ఫిబ్రవరి26 (ఆంధ్రజ్యోతి): వరంగల్, నల్గొండ, ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి గురువారం జరగనున్న పోలింగ్ ప్రక్రియకు గాను అధికార యంత్రాంగం ఏర్పాట్లను సర్వసిద్ధం చేశారు. ఆయా కేంద్రాలో మొత్తం ఉపాధ్యాయ ఓటర్లు 611 మందికి గాను పురుషులు 398, మహిళలు 213 మంది తమ ఓటు హక్కును వినియోగించనున్నట్లు ఆర్డీవో రాజేంద్రగౌడ్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా కల్లూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గల 104 ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీవో పరిశీలించారు. పోలింగ్ అధికారులకు తగిన సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ సాంబశివుడు, ఆర్ఐ స్టాలీన్ తదితరులు పరిశీలించారు.

వైరాలో..

వైరా, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వైరాలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. పోలింగ్ స్టేషన్ 122లో గురువారం ఈ పోలింగ్ జరగనుంది. 113మంది ఓటర్లు ఇక్కడ ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. ఒక్కరేసి పీవో, ఏపీవోలు, ఇద్దరు ఓపీవోలు, ముగ్గురు పోలీసు సిబ్బంది ఇక్కడకు చేరుకున్నారు. వైరా తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలింగ్ ఏర్పాట్లు చేశారు. ఉదయం 8నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరగనుంది.

కొణిజర్లలో...

కొణిజర్ల, ఫిబ్రవరి26(ఆంధ్రజ్యోతి): నేడు జరగనున్న ఖమ్మం, వరంగల్, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు గాను కొణిజర్ల మండలానికి సంబంధించి మండల కేంద్రం కొణిజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 66 ఉపాధ్యాయ ఓట్లు ఉన్నాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ బుధవారం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. కొణిజర్ల పోలింగ్‌కేంద్రంలో మొత్తం 66 ఓట్లు ఉన్నాయని, అందుకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయు లు సకాలంలో ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు.



కొణిజర్ల పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఎన్నికల సిబ్బంది

మధిరటౌన్‌లో...

మధిరటౌన్, ఫిబ్రవరి26(ఆంధ్రజ్యోతి): మధిర మండలంలో మొత్తం 203 మంది ఓటర్లు ఉండగా, వారిలో పురుషులు 121 మంది, మహిళలు 82 మంది ఉన్నారు, మధిర పట్టణంలోని టీవీ ఎం ప్రభుత్వ పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మధిర తహసీల్దార్ రాంబాబు పోలింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించనుండగా, సీఐ మధు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తును పర్యవేక్షించనున్నారు.



వైరాలో పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఎన్నికల సిబ్బంది



పోలింగ్ కేంద్రం వద్ద ఎన్నికల సామగ్రితో అధికారులు

సత్తుపల్లిరూరల్‌లో..

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలలో సత్తుపల్లి మండలంలో 277మంది ఓటుహక్కును నేడు వినియోగించుకోనున్నారు. సత్తుపల్లి పట్టణంలోని గర్ల్ జూనియర్ కళాశాలను 117వ పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేయగా ఒక పోలింగ్ అధికారి, ఒక సహాయ పోలింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ సిబ్బంది ఎన్నికల నిర్వహణకు కేటాయించారు. పోలింగ్ సామాగ్రితో బుధవారం సాయంత్రం చేరుకోగా పోలీస్ బందోబస్తును అధికారులు ఏర్పాటు చేశారు.

గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలి



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

» డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

చింతకాని, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాల్సిన బాధ్యత మనందరిమీద ఉందని ఉపముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం మండల పరిధిలోని నేరడ గ్రామంలో మహాశివరాత్రి జాతర సందర్భంగా నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. తొలుత భట్టి విక్రమార్క దంపతులు శ్రీభ్రమరాంభ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, హస్తకళా అభివృద్ధి చైర్మన్ నాయుడు సత్యం, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, నాయకులు కన్నెబోయిన గోపి, మడిపల్లి భాస్కర్, కొప్పుల గోవిందరావు, దూసరి గోపి, పెంట్యాల అప్పారావు, కొల్లి సీతయ్య పాల్గొన్నారు.

రెండు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ వెంకటేష్

ఎర్రుపాలెం, ఫిబ్రవరి26(ఆంధ్రజ్యోతి): మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా తెలంగాణ, ఏపీ రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలను ఎర్రుపాలెం ఎస్ఐ వెంకటేష్, ఆలయ కమిటీ చైర్మన్ యన్నం పిచ్చిరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈపోటీలో 35 జట్లు తలపడనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ వైస్ చైర్మన్ పెద్దమళ్ల మోహన్‌రావు, మాజీ సొసైటీ చైర్మన్ యన్నం సత్యనారాయణరెడ్డి, గ్రామస్థులు బొగ్గుల రామచంద్రారెడ్డి, ఎదురుకృష్ణారెడ్డి, బానాల శ్రీనివాసరావు, పీఈటీలు గూడూరు సత్యనారాయణరెడ్డి, తల్లపురెడ్డి గోపి, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు



గండగలపాడులో ఫ్లెక్సీలు తరలిస్తున్న మునిసిపల్ సిబ్బంది

వైరా, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా అధికార పార్టీ నాయకులు అత్యుత్సాహంతో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అధికారులు వెంటనే వాటిని తొలగించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇంకా అనేకమంది నాయకుల ఫొటోలు, సంక్షేమ పథకాలను వివరిస్తూ మహాశివరాత్రికి శుభాకాంక్షలు తెలుపుతూ స్నానాల లక్ష్మీపురం వెళ్లే రహదారిలో ఉన్న మునిసిపాలిటీ పదోవార్డు గండగలపాడు, అలాగే లక్ష్మీపురంలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీల విషయం గురించి కొన్ని డిజిటల్ మీడియా అలాగే సోషల్‌మీడియాలో హల్‌చల్ చేయడంతో వెంటనే అధికారులు అప్రమత్తం అయి వాటిని తొలగించారు.

నేరడ దేవాలయం వద్ద స్నాన ఘట్టాల పరిశీలన



స్నాన ఘట్టాలను పరిశీలిస్తున్న దయాకర్‌రెడ్డి

చింతకాని, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నేరడ గ్రామంలోని శ్రీ భ్రమరాంబ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరి దయాకర్ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం ఎదురుగా ఉన్న చెరువులో భక్తుల సౌకర్యార్థం దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన స్నాన ఘట్టాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మందడపు శ్రీను, మంకెన రమేష్, కిలారు మనోహర్, కన్నెబోయిన సీతరామయ్య పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులను ఆదుకోవాలి

తిరుమలాయపాలెం,ఫిబ్రవరి26(ఆంధ్రజ్యోతి): అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేసి ఆదుకోవాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లానాయకులు కూసు అప్పారావు తెలిపారు. బుధవారం మండలంలోని దమ్మాయిగూడెంలో ఆపార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈసందర్బంగాఆయన మాట్లాడుతూ సన్న, చిన్నకారురైతులు, అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులకు పనికితగిన వేతనం ఇవ్వాలన్నారు. ఈనెల 28న ఢిల్లీలో సదస్సుజరుగుతుందని, దీనిని విజయవంతం చేయాలన్నారు ఈకార్యక్రమంలో రేపాకుల శివలింగం, తిమ్మిడి హనుమంతరావు, ఆరెంపుల వెంకన్న, ఎస్.వెంకటేశ్వర్లు, తదితరులున్నారు.